"నో" కోలా ప్రతినిధి అన్నాడు. "ఇరవై వేల రూపాయల పెట్టుబడితో పోటీకి సిద్ధమైన ఛాలెంజర్ మిస్టర్ విశ్వనాథ్. . ."

ఉన్నట్టుండి ఆడిటోరియంలో నిశ్శబ్దం ఆవరించింది.

మసక వెలుతురులో ఓ మూల కూర్చున్న కృషి చూస్తుండగానే డయాస్ పైకి వచ్చాడు విశ్వనాథ్- కొన్ని గంటల క్రితం దాకా కృషి ధూర్జటిగా అనుకుంటున్న వ్యక్తి.

ఒక మోసగాడిగా పరిచయమైన వ్యక్తి ఇప్పుడో మేధావిలా ఇలాంటి పోటీలో పాల్గొనటాన్ని ఆమె ఊహించలేక పోయింది.

ప్రేక్షకుల నుంచి రెస్పాన్స్ లేదు. అయినా అదేమీ పట్టించుకోనంత నిశ్చలంగా తన సీటులో సెటిలయ్యాడు ధూర్జటి అలియాస్ విశ్వనాథ్.

"దూరదర్శన్‌లో తరచుగా క్విజ్ కాంపిటీషన్స్ నిర్వహించే వాసు ఇప్పుడు క్విజ్ మాస్టరుగా వ్యవహరిస్తారు"

క్విజ్ మాస్టరు వాసు స్కోర్ కౌంట్ చేసే ఓ అమ్మాయితో బాటు వేదిక పైకి వచ్చి ప్రేక్షకులకి నమస్కరించాడు.

చప్పట్లు కేకల్తో ఆడిటోరియం హోరెత్తిపోయింది.

"డియర్ ఫ్రెండ్స్" ప్రేక్షకుల్నే గాక పోటీలో పార్టిసిపేట్ చేస్తున్న రాజేంద్ర, విశ్వనాథ్‌ల్ని ఉద్దేశిస్తూ అన్నాడు వాసు "క్విజ్ కాంపిటీషన్‌లో చాలా నియమాలున్నా ఈ పోటీని స్పాన్సర్ చేసే కోలా కంపెనీ నిబంధనల ప్రకారం పోటీ డ్యూరేషన్ మొత్తం గంట యాభై నిముషాలలో చెరో అయిదు నిముషాలు ఒక్కొక్కర్ని ప్రశ్నించడం జరుగుతుంది. ఒక్కో జవాబుకి నిర్దేశించబడిన మార్కులు పది. ప్రశ్న అడిగిన తర్వాత ఆలోచించడానికి వ్యవధి కేవలం ముప్పై సెకండ్లు మాత్రమే. ముప్పై సెకండ్లు వ్యవధి పూర్తి కాగానే ఆ అసిస్టెంట్ బజర్ నొక్కుతుంది. జవాబు చెప్పే అవకాశం రెండో వ్యక్తికి దక్కుతుంది. ఐ థింక్ అయామ్ క్లియర్...."

అంగీకారంగా తలలు పంకించారు రాజేంద్ర, విశ్వనాథ్‌లు.

సరిగ్గా ఏడు గంటలకి రిస్ట్‌వాచ్ చూసుకున్న క్విజ్ మాస్టరు వాసు పోటీ ప్రారంభిస్తూ రాజేంద్రతో అన్నాడు "ది ఫస్ట్ క్వెశ్చన్ ఈజ్ ఫర్యూ మిస్టర్ రాజేంద్ర. . . రిఫ్లెక్సాలజీ అంటే ఏమిటి?"

"ఇదో కొత్త వైద్య విధానం. కాలు లేక చేతి బొటనవేలుకి సంబంధించిన రిఫ్లేక్స్ భాగాల్ని వత్తి శరీర రుగ్మతల్ని నయం చేసే ప్రక్రియని రిఫ్లెక్సాలజీ అంటారు."

"రైట్. . .మిస్టర్ విశ్వనాథ్. . . రిఫ్లెక్సాలజీ గురించి పరిశోధించిన వ్యక్తి ఎవరు"

"అమెరికాకి చెందిన డాక్టర్ విలియం ఫిడ్జిగెరాల్డ్" టక్కుమని చెప్పాడు విశ్వనాథ్.

"రైట్ మిస్టర్ విశ్వనాథ్. . . ఈ మధ్యనే చనిపోయిన ప్రభుత్వ అమెరికన్ రచయిత ఇర్వింగ్ వేలెస్ మొదటి నవల ఏది?"

“1959లో అతడు రాసిన నవల ది సిన్నాఫ్ ఫిలిప్ ఫ్లెమింగ్”

“వండర్‌ఫుల్” అభినందించిన క్విజ్ మాస్టర్ ఇప్పుడు రాజేంద్రని చూస్తూ అడిగాడు. “బ్రిటన్‌లోని కొందరు వృద్ధ మహిళల్లో ఇప్పటికీ వున్న ఓ మూఢనమ్మకం డిశెంబరు ఇరవై ఎనిమిదో తేదిన బట్టలు ఉతక కూడదని. . . కారణం ఏమిటో చెప్పగలరా?”

రాజేంద్ర ఉత్సుకతగా అన్నాడు. “హీరో చక్రవర్తి క్రీస్తు ఎక్కడో జన్మించాడన్న భయంతో మగ బిడ్డల్ని హతమార్చమన్నది డిసెంబరు ఇరవై ఎనిమిదో తేదీన. కాబట్టి ఆ రోజున బట్టలు ఉతికే కుటుంబానికి చెందిన ఓ పురుషుడికి ప్రాణ హాని జరుగుతుందని ఇప్పటికీ వున్న మూఢ నమ్మకం.”

విద్యార్థులు చప్పట్లు కొడుతూంటే “యూ ఆర్ రైట్ మిస్టర్ రాజేంద్ర. వన్ మోర్ క్వెశ్చన్ టూ యు. బి.ఆర్. చోప్రా మహాభారత్‌లో టెలికాస్ట్ చేయటానికి బిబిసి చెల్లించిన మొత్తం ఎంత” అడిగాడు రాజేంద్రని చూస్తూ.

నిశ్శబ్దంగా వుండిపోయాదు రాజేంద్ర.

పది సెకండ్లు గడిచేక “లక్ష పౌండ్‌లు” అనేశాడు.

“రాంగ్”

ఆడిటోరియం ఆసక్తిగా గమనిస్తుండగా ముప్పై సెకండ్లు గడిచినట్లు బజరు మోగింది.

“ఇప్పుడు మీరు జవాబు చెప్పాలి మిస్టర్ విశ్వనాథ్” అన్నాడు క్విజ్ మాస్టర్ వెంటనే.

“డెబ్బై రెండు వేల ఎనిమిది వందల పౌండ్లు”

“రైట్ మిస్టర్ విశ్వనాథ్” రెండు సెకండ్ల వ్యవధి తర్వాత అడిగాడు “తుమ్ములన్నవి మనిషికి సహజంగా వస్తాయి. ఎవరైనా తుమ్మితే మనం తెలుగులో అయితే నూరేళ్ళ ఆయుష్షు అంటూ ఆశీర్వదిస్తాం. ఇంగ్లీషులో అయితే ‘బ్లెస్ యు’ అంటాం. ఈ సాంప్రదాయానికి మూలం చెప్పగలరా?”

“పదిహేడో శతాబ్దంలో బ్రిటన్‌లో ప్లేగు వ్యాధి మూలంగా వేలమంది ప్రాణాలు కోల్పోయారు”

ఆసక్తిని మించిన విస్మయంతో చూస్తూంది ఆడిటోరియంలో కూచున్న కృషి.

“ప్లేగు వ్యాధికి గురైన మనిషి తప్పకుండా చనిపోతాడనుకోటానికి కనిపించే ముఖ్యమైన సిమ్టమ్ తుమ్మడం. కాబట్టి ఈ వ్యాధికి గురైన ఏ వ్యక్తి అయినా తుమ్మగానే యిక మరణం తథ్యమని తెలిసిన వ్యక్తులు ‘బ్లెస్ యు’ అనేవారు. ఆ సాంప్రదయం బ్రిటన్ పాలన ద్వారా మనకీ వచ్చింది.”

పలచగా వినిపించాయి చప్పట్లు క్రమంగా విశ్వనాథ్ సైతం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్న సూచనగా.

“మిస్టర్ రాజేంద్ర. తాజ్‌మహల్ నిర్మాణానికి ప్రేరణగా చరిత్రలో మిగిలిన ముంతాజ్ కి షాజహాన్‌కి పిల్లలెంతమంది?”

"పధ్నాలుగుమంది"

"రైట్. మెజిషియన్ అఫ్ ఐరన్ అనే టైటిల్ గల వ్యక్తి ఎవరు?"

రాజేంద్ర వెంటనే చెప్పడం ప్రారంభించాడు. "రాట్ ఐరన్‌తో సుమారు మూడు వందల మీటర్ల పొడవున్న ఈఫిల్ టవర్‌ని నిర్మించిన ఫ్రెంచ్ ఇంజనీర్ అలెగ్జాండర్ గుస్తావ్ యూఫెల్‌ని మెజీషియన్ ఆఫ్ ఐరన్ అంటారు."

"వెరీ కరక్ట్. నౌ. . . ఇట్స్ యువర్ టర్న్ మిస్టర్ విశ్వనాథ్. . . ఓ మనిషికుండే ఎముకలెన్ని?"

వెంటనే జవాబు చెప్పలేదు విశ్వనాథ్. "బాల్యంలోనా, యవ్వనంలోనా."

క్విజ్ మాస్టర్ కంగారుపడటాన్ని గమనించింది కృషి.

విశ్వనాథ్ ప్రశ్నకి ఎగతాళిగా ఓ మూల నుంచి విద్యార్థి బృందం కేకలు పెడుతుంటే విశ్వనాథ్ రియాక్టు కాలేదు. క్విజ్ మాస్టర్ ప్రశ్నకి జవాబులా అన్నాడు. "ఏ మనిషికైనా బాల్యంలో వుండేవి మూడువందల ఎముకలు. కాని వయసు పెరిగేకొద్దీ తొంభై నాలుగు ఫ్యూజయి యవ్వనంలో అడుగుపెట్టేసరికి రెండు వందల ఆరుదాకా మిగులుతాయి."

సాలోచనగా తల పంకించాడు క్విజ్ మాస్టర్ "యూ ఆర్ రైట్ మిస్టర్ విశ్వనాథ్. నిజమే నా ప్రశ్న ఇంకా క్లియర్‌గా వుండాల్సింది."

కేవలం కృషి మాత్రమే అసంకల్పితంగా చప్పట్లు కొట్టి తలతిప్పి తనవేపే అంతా చూస్తుంటే యిబ్బందిగా కదిలింది క్షణం పాటు.

"సిగ్గుతో మొహం ఎర్రబడడం అంటే మీకు తెలుసుగా. . . దానికి శాస్త్రీయమైన కారణం చెప్పండి"

"ఇది పుట్టుకతో వచ్చే రియాక్షన్ కాదు. రెండు నుంచి నాలుగేళ్ళ వయసు మధ్యలో అలవడే రిఫ్లెక్స్ యాక్షన్. ఏదన్నా అవమానం జరిగినప్పుడు మెదడు నెర్వ్‌సిగ్నల్స్ పంపుతుంది. పెప్టయిడ్ అనే రసాయనాన్ని విడుదల చేస్తుంది. ఆ రసాయనం మొహానికి సంబంధించిన బ్లడ్ వెస్సెల్స్‌పై పనిచేసి మోహం ఎర్రబడేట్టు చేస్తుంది" ఇందాక తన మొహం ఎరుపెక్కిన క్విజ్ మాస్టర్ ముఖ కవళికల్ని గమనిస్తూ చెప్పాడు విశ్వనాథ్.

"నౌ మిస్టర్ రాజేంద్ర. . . నెలకి సగటున ఓ మనిషి జుట్టు పెరిగే పొడవెంత?"

"పది మిల్లీ మీటర్లు"

"రైట్. మెదడులో ఎక్కువ భాగం శరీరంలోని ఏ అవయవాన్ని నియంత్రించటానికి ఉపయోగించబడుతుంది."

"బొటనవేలుని"

"రైట్. నౌ మిస్టర్ విశ్వనాథ్- సీజర్‌కి సిజేరియన్‌కి గల సంబంధం ఏమిటి?"

"సీజర్ రోమన్ చక్రవర్తి. తల్లి కడుపుని కోసి బిడ్డను తీయడన్ని సిజేరియన్ అంటారు.

అంతకుమించి లాటిన్ భాషలో CAEJARE అంటే TO CUT అన్న అర్థం కూడా వస్తుంది"

అవసరానికి మించి జవాబు చెబుతున్న విశ్వనాథ్ విషయంలో ఆసక్తికన్నా అసహనం ఎక్కువైనట్టు చూసాడు క్విజ్ మాస్టర్. "అనూహ్యమైన షాక్ మూలంగా ఒక్క రాత్రికే జుట్టు తెల్లబడటం గురించి మీరు వినే వుంటారు. ఇదెలా సాధ్యం."

"నిజానికి అనుకోని షాక్‌తో జుట్టు తెల్లబడదు. నల్ల వెంట్రుకలన్నీ రాలిపోయి వాటి మరుగున వున్న తెల్లవెంట్రుకలు మాత్రం మిగులుతాయి . ఇది సైన్స్ చెప్పే సత్యం."

"రైట్- నౌ మిస్టర్ రాజేంద్ర ప్రపంచలో మొట్టమొదటిసారిగా రోడ్డుపై మనం వాడే 'తారు'ని కనిపెట్టిందెవరు."

"స్కాట్ లాండ్‌కి చెందిన ఇంజనీర్ పద్దెనిమిదో శతాబ్దంలో పుట్టిన జాన్ లాడెన్ మెక్ ఆడమ్"

"రైట్. . . ఇంతవరకూ అసాసినేషన్‌లో ప్రాణాలు కోల్పోయిన బ్రిటీష్ ప్రధానులెంతమంది, ఎవరెవరు?"

"1812 మే పదకొండవ తేదీన హౌసాఫ్ కామన్స్ లాబీలో అసాసినేట్ చేయబడిన ప్రధాని ఒక్కరే. అతని పేరు స్పెన్సర్ పర్సినల్"

"వెరీ కరెక్టు - మిస్టర్ విశ్వనాథ్. . . స్త్రీలకి ఓటు హక్కు నిచ్చిన మొదటిదేశం ఏది, ఏ సంవత్సరంలో?"

"న్యూజిలాండ్. . .1893లో"

"రైట్. . . దేశంలో ఆడపిల్ల పెళ్ళి ఓ సమస్య అయితే అమ్మాయి పుట్టకముందే పెళ్ళి కుదుర్చుకునే సాంప్రదాయం గల ఓ ప్రాంతం వుంది. అది ఏది?"

"ఆస్ట్రేలియాకి చెందిన మెలివిల్లి దీవిలోని ప్రజల్లో వున్న ఆచారమది. ఓ యువతికి పెళ్ళి జరుగుతున్న సమయంలోనే పుట్టబోయే ఆడపిల్లని కోడలుగా చేసుకునేట్టు కాంట్రాక్టులు రాసుకుంటారు."

పోటీలో మొదటి ఏభై నిముషాలు పూర్తికావటంతో క్షణం ఆగాడు క్విజ్ మాస్టర్.

క్విజ్ మాస్టర్ అసిస్టెంట్ స్కోర్ తెలియచేసింది.

"మిస్టర్ విశ్వనాథ్ నూరుశాతం స్కోర్ చేసి నూరు మార్కులతో మొదటి స్థానంలో వున్నారు. ఒక ప్రశ్నకి జవాబు చెప్పలేకపోయిన మిస్టర్ రాజేంద్ర స్కోర్ తొంభై మార్కులు."

ఓ మూల రాజేంద్ర బృందం మినహా ఆడిటోరియం మొత్తం చప్పట్లతో అభినందించింది విశ్వనాథ్‌ని.

"ఇప్పుడు. . ." క్విజ్ మాస్టర్ వాసు అన్నాడు రాజేంద్రని చూస్తూ "ముందు వివరించిన నిబంధన ప్రకారం మీకు అయిదు నిముషాలు కేటాయించి పది ప్రశ్నల్ని అడగబోతున్నాను.

ప్రారంభిస్తున్నాను"

రాజేంద్రలో మునుపటి ఉత్సాహం లేదు. సీరియస్‌గా విశ్వనాథ్ వేపు చూశాడు.

ఇదేమీ పట్టించుకోనట్టు విశ్వనాథ్ ఆడిటోరియంలోకి చూస్తున్నాడు ఎవర్నో వెదుకుతున్నట్టుగా.

ఆ క్షణాన విశ్వనాథ్ గెలుపుని కోరుకోవడం కృషిలో అనాలోచితంగా జరిగిన చర్య కావచ్చు. కాని ఇందులో నిజాయితీ వుంది. ముందు ఓ మోసగాడిలా అనిపించినా ఇప్పుడు వచ్చిన మార్పుతో దానిని ఆకతాయితనంగా భావించాలని మనసు ఉబలాట పడుతోంది. అదికూడా కాదు ప్రేక్షకుల నుంచి అతడి మేధస్సుకి పెద్ద రెస్పాన్స్ లేకపోయినా అతడు సాగిస్తున్న ఒంటరి పోరాటానికి తనైనా అండ నిలవాలనిపిస్తూంది. అంతే.

"మిస్టర్ రాజేంద్రా- ఎల్ సాల్వడార్ కరెన్సీ పేరు"

"కోలన్స్"

"థాయ్‌లాండ్ భాష పేరు"

"థాయ్"

"హంగరీ రజధాని"

"బుడాపెస్ట్"

"గ్రీక్స్ సిటీ ఆఫ్ సర్‌గా పిలిచే లెబనాన్ సిటీ"

"బాల్‌బెక్"

"జమ్మూకాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ నాయకుడెవరు"

"అమానుల్లాఖాన్"

"ఏభై సంవత్సరాలపాటు ప్రపంచానికి దూరంగా ఒంటరితనంలో గడిపి ఈ మధ్యనే చనిపోయిన నటి పేరు"

"గ్రేటా గార్బో"

"మనిషి కిడ్నీ సగటున నిముషానికి ఫిల్టర్ చేసేబ్లడ్ ఎంత?"

"వన్ పాయింట్ త్రి లీటర్స్"

"గ్రీక్ వేదాంతి ప్లేటో భార్య పేరు?"

"ప్లేటో అవివాహితుడు"

"ప్లేటో లాగే పెళ్ళి చేసుకోని ప్రముఖ ఫ్రెంచ్ దార్శనికుడు"

"జీన్ పాల్ సార్త్రె"

"సిగ్మండ్ ఫ్రాయిడ్ భార్య పేరు?"

"మార్తా బెర్నేస్"

ఆడిటోరియం కరతాళ ధ్వనులతో నిండిపోయింది రాజేంద్ర పది ప్రశ్నల్ని నూరు శాతం ఆన్సర్ చేసిన సందర్భంగా

"కంగ్రాట్స్ మిస్టర్ రాజేంద్ర. పది ప్రశ్నలకి సరైన జవాబులు చెప్పి మొత్తం నూట తొంబై మార్కుల్ని స్కోర్ చేశారు" క్విజ్ మాస్టర్ రాజేంద్రని అభినందిస్తూ విశ్వనాథ్ వేపు చూసాడిప్పుడు. "నౌ ఇట్స్ యువర్ టర్న్ మిస్టర్ విశ్వనాథ్. భార్యకాక సిగ్మండ్ ఫ్రాయిడ్ని అమితంగా ప్రభావితం చేసిన యువతి ఎవరు?"

"మిన్నా. . . ఫ్రాయిడ్ భార్య మార్తా చెల్లెలు."

"రైట్. పదిహేనేళ్ళ వయసులో ఇంట్లో నుంచి పారిపోయి ద్రాక్షతోటలో పని చేయడంతో పాటు అంట్లు తోమేవాడుగా, ఆటోమెకానిక్గా పనిచేసిన ఓ వ్యక్తి అమెరికన్ ప్రెసిడెంట్ అయ్యాడు" క్విజ్ మాస్టర్ ప్రశ్న పూర్తి కాలేదు జవాబు చెప్పాడు విశ్వనాథ్.